సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



యుద్ధవిద్యలు అవసరం

ఆత్మరక్షణకు యుద్ధవిద్యలు ఎంతగానో దోహదపడతాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. 8లో▸



విశ్వాసం కోల్పోయిన..

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ అన్నారు. 8లో▸



'బెల్టు' మూసేయండి

పచ్చని పల్లెల్లో చిచ్చుపెడుతున్న బెల్టు దుకాణాలను మూసివేయాలని ఓ యువకుడు నిరాహార దీక్షకు దిగాడు. 8లో▸

అభివృద్ధికి అడుగులు!

రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణం కోసం మార్కింగ్

- ఇంటిగ్రేటెడ్ స్కూల్, మినీ స్టేడియం కోసం ప్రతిపాదనలు
- షాద్‌నగర్ నుంచి పరిగికి నాలుగు లేన్ల రోడ్డు విస్తరణకు చర్యలు
- మారనున్న కొందుర్గు రూపురేఖలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



కొందుర్గులో వేసిన మార్కింగ్

కొందుర్గు: రీజినల్ రింగ్ రోడ్డు.. ఇంటిగ్రేటెడ్ స్కూల్.. మినీ స్టేడియం.. షాద్‌నగర్ నుంచి పరిగికి నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో కొందుర్గుకు మహర్దశ రానుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. షాద్‌నగర్ నుంచి పరిగి ఆర్ అండ్ బీ రహదారిపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్ నుంచి పరిగికి నాలుగు లేన్ల రోడ్డు ఏర్పాటుకోసం ప్రతిపాదనలు పంపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీజినల్ రింగ్‌రోడ్డు మండల కేంద్రంతోపాటు దాదాపు పది గ్రామాలను మీదుగా వెళ్లడం అభివృద్ధికి మరింత ఊతం ఇవ్వనుంది. రింగ్‌రోడ్డు ఏర్పాటుకోసం ఇప్పటికే ఏరియల్ సర్వేచేసి ఆయా గ్రామాల్లో మార్కింగ్ చేశారు.

భూముల ధరలకు రెక్కలు

పూర్తిగా కేంద్రప్రభుత్వం నిధులు రూ. 50 కోట్లతో చేపట్టనున్న కేల్ ఇండియా క్రీడా మైదానం కోసం కొందుర్గు పడమర శివారులోని సర్వే నంబర్ 19లో పది ఎకరాల స్థలాన్ని ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లతో ఏర్పాటుచేయనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం కొందుర్గు తూర్పు శివారులోని సర్వే నంబర్ 109లో 16 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ప్రతిపాదనలు పంపించారు. అన్నీ పూర్తయితే కొందుర్గు రూపురేఖలు మారిపోతాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. భూముల ధరలకు రెక్కలు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



షాద్‌నగర్ నియోజకవర్గంలో మారుమూల మండలాలైన కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలను అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం. రోడ్డు సౌకర్యం, విద్య, వైద్యం బాగుంటే ఆయా గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయి. ఇందుకోసం కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరాం. మారుమూల గ్రామాల నుంచి పట్టణాలకు రోడ్డు మార్గం ఉంటే ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. పాలమూరు ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుంది. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోంది.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్



సమావేశంలో మాట్లాడుతున్న కె.లక్ష్మణ్

సేవా దృక్పథం కలిగిన పార్టీ బీజేపీ

ఎంపీలు కె.లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తుక్కుగూడ: దేశంలో సేవా దృక్పథం కలిగిన ఏకైక పార్టీ తమదని ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఆదివారం తుక్కుగూడ బస్టాండ్‌లో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి.యాదీష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ ఎన్నికల సమయంలో రాజకీయం తప్ప మిగిలిన రోజుల్లో ప్రజలకు సేవ చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఓట్ల రాజకీయం అనంతరం వసూలు కార్యక్రమాలు చేస్తుందని విమర్శించారు. ప్రపంచం మెచ్చిన నేత ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచ దేశాలు ఆర్థికంగా, రాజకీయంగా ఉనికిని కోల్పోతుంటే భారతదేశం మాత్రమే ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తెలంగాణలో నాయకులు ఎప్పుడు, ఎవరు, ఏ పార్టీలో ఉంటున్నారో అయోమయంగా ఉందన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువతకు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్, పార్టీ రాష్ట్ర నాయకులు తూళ్ల వీరేందర్‌గౌడ్, అందెల శ్రీరాములు యాదవ్, బోసుపల్లి ప్రతాప్, పొరెడ్డి అర్జున్‌రెడ్డి, నర్సింగ్‌రాజు, మధన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

షాద్‌నగర్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా మత్స్యకారుల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ముదిరాజ్ తాలుకాసంఘం కార్యాలయంలో సంఘం కన్వీనర్ మంగ వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహ ఈ నెల 25న ఇబ్రహీంపట్నంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న మత్స్యకారుల రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మత్స్య వృత్తిపై ఆధారపడి పది లక్షల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ ప్రభావంతో భూములు ధరలు విపరీతంగా పెరిగిపోయి చెరువులు, కుంటలు కబ్జాకు గురవుతున్నాయని.. మత్స్యకారులకు ఉపాధి కరువవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 20 ఏళ్లుగా చెరువులు, కుంటల కబ్జాలపై అనేక పోరాటాలు చేసినట్టు చెప్పారు. కబ్జాలపై కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. ఈ నెల 25న నిర్వహించనున్న మత్స్యకారుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీధర్‌వర్మ, అశోక్, గిరిబాబు, అజయ్, మధు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

న్యూస్‌రీల్

కేవీ రమేష్‌రాజుకు లయన్స్ క్లబ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రమేష్‌రాజు

ఇబ్రహీంపట్నం: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320సి అవార్డ్స్ కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం లయన్ కేవీ రమేష్‌రాజు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఫర్ లయన్ ఇమేజ్ అవార్డును దక్కించుకున్నారు. నగరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి.బాబురావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.హరీష్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. 2023–24 సంవత్సరానిగాను లయన్స్ క్లబ్ తరపున చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డు ఇచ్చినట్లు రమేష్‌రాజు తెలిపారు.

'గో ధ్వజ్ స్థాపన భారత్ యాత్ర' పోస్టర్ ఆవిష్కరణ



యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

హుడాకాంప్లెక్స్: రవీంద్రభారతిలో అక్టోబర్ 9న జరిగే 'గో ధ్వజ్ స్థాపన భారత్ యాత్ర–2024'ను జయప్రదం చేయాలని రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సరూర్‌నగర్‌లో ఆదివారం యాత్ర పోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. గోవును ఒక ప్రాణిగా కాకుండా తల్లిగా గౌరవించడం భారతజాతి లక్షణమని అన్నారు. గోమాతకు జాతీయమాతగా గౌరవం ఇవ్వడం.. గో హత్యను నిర్మూలించే భారతదేశాన్ని నిర్మించేందుకు దేశవ్యాప్తంగా 'గో ప్రతిష్ట' పేరుతో ఆందోళన కార్యక్రమం నడుస్తోందని తెలిపారు. ముకుందానంద బ్రహ్మచారి, దక్షిణపీఠం స్వాగత కమిటీ చైర్మన్ చిల్లప్ప లక్ష్మీరాజ్యం సమక్షంలో గో ధ్వజ్ స్థాపన భారత యాత్ర జరుగుతోందని చెప్పారు. ఇందులో భాగంగా త్వరలో రవీంద్ర భారతిలో జరిగే కార్యక్రమానికి జగద్గురు శంకరాచార్యస్వామి, ముక్తేశ్వరనంద సరస్వతి–1008 హాజరవుతారని వివరించారు.

అధిక స్థాయి రేడియేషన్‌తో కేన్సర్ ముప్పు

లక్డీకాపూల్: అధిక స్థాయి రేడియేషన్‌తో సంబంధం కలిగి ఉంటే కేన్సర్ వ్యాధి బారినపడే ప్రమాదముందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆహారపు అలవాట్లతో పాటు ధూమపానం, ఇన్‌ఫెక్షన్లతో క్రానిక్ మైలోజెనస్ ల్యుకేమియా(సీఎంఎల్) సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. ప్రపంచ సీఎంఎల్ డేను పురస్కరించుకుని నిమ్స్ మెడికల్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప మాట్లాడుతూ.. సీఎంఎల్ అనేది కేన్సర్ వ్యాధి నెమ్మదిగా పెరుగుతున్న రూపమన్నారు. ఈ సమస్యతో చాలా మంది ఎక్కువ కాలం జీవనం సాగించాల్సి వస్తుందన్నారు. అయితే కొంత మంది రోగులకు స్టెమ్ సెల్ మార్పిడితో నయం చేయవచ్చు కానీ ఇది సంక్లిష్టమైన ప్రక్రియ అని చెప్పారు. వ్యాధి నిర్ధారణ, లక్షణాలు, చికిత్స విధానంపై ఆయన అవగాహన కల్పించారు.

మూసీ నివాసితుల్లో హైడ్రా గుబులు!

- పాత నోటీసుల ఆధారంగానే చర్యలు
- హైడ్రాకు అక్రమ కట్టడాల తొలగింపు బాధ్యత
- నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు



సాక్షి, సిటీబ్యూరో: మూసీ పరీవాహక నివాసితులకు హైడ్రా భయం పట్టుకుంది. మూసీ సుందరీకరణలో భాగంగా పరివాహక ప్రాంతాల్లోని అక్రమ కట్టడాలను తొలగించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే రెవెన్యూ యంత్రాంగం అక్రమ కట్టడాలను గుర్తించి నోటీసులు జారీ చేసింది. తాజాగా పాత నోటీసుల ఆధారంగానే కట్టడాలను తొలగించేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా హైడ్రాకు బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధ మైంది. దారిద్ర్య రేఖకు దిగువ ఉండి నివాసాలు కోల్పోయే నిర్వాసితులకు ప్రత్యామ్నాయంగా పున రావాసం కల్పించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా ఇటీవల రెండు ప్రాంతాలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాలను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించి ఖాళీగా ప్లాట్స్‌పై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మూసీ నిర్వాసితులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటామని పేర్కొనడాన్నిబట్టి తరలింపు ఖాయమని తెలుస్తోంది. ఇప్పటికే చెరువులు, కుంటలు, నాలాల పరివాహకంలోని అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపిస్తున్న హైడ్రా త్వరలో మూసీ పరివాహకంలో అక్రమ కట్టడాలపై సైతం ఆపరేషన్‌కు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

12 వేల పైనే అక్రమ కట్టడాలు

మూసీ పరివాహక సుమారు 55 కిలోమీటర్ల పరిధిలో అక్రమ కట్టడాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఇటీవల రెవెన్యూ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సంయుక్తంగా సర్వే నిర్వహించగా ఆక్రమణలు 12,184 బయటపడ్డాయి. వాటిని రెండుగా వర్గీకరించి నదీగర్భం, బఫర్ జోన్లుగా విభజించారు. నదీ గర్భంలో 2,166 చోట్లు గుర్తించగా అందులో 288 చోట్ల భారీ నిర్మాణాలున్నాయి. నదీ సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్లు వరకు ఉన్న బఫర్‌జోన్ పరిధిలో 7,851 ఆక్రమణలు, ఇందులో 1032 భారీ నిర్మాణాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్‌లో 3004 అక్రమ కట్టడాలున్నట్లు బయటపడింది. అయితే మొదటి విడతగా నదీగర్భంలో గల కట్టడాలు తొలగించేందుకు సిద్ధమవుతున్నారు

ప్రత్యామ్నాయం సాధ్యమేనా?

మూసీ పరివాహకంలో మొదటి విడతగా తొలగించే కట్టడాలతో సుమారు రెండు వేలకు పైగా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టిపెట్టింది. వారికి పునరావాసం కింద డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని యోచిస్తోంది. అందులో భాగంగా రెండు రోజుల క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్, మున్సిపల్, రెవెన్యూ ఉన్నతాధికారులు సైదాబాద్, వనస్థలిపురం ప్రాంతాల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాలను పరిశీలించారు. రెండింటిలో మొత్తం మీద మూడు వందలకు పైగా ఖాళీగా లేదు. గతంలో కొందరు మూసీ నిర్వాసితులకు శివారు ప్రాంతాల్లో ఇళ్లు కేటాయించినా..తిరిగి వెనక్కి వచ్చినట్లు తెలుస్తోంది.

40 శాతానికి పరిమితం

మూసీ నది పరివాహకం అసలు వెడల్పులో ప్రస్తుతం 40 శాతానికి పరిమితమైంది. ఇప్పటికే మూసీ నది రివర్ బెడ్ దాదాపు ఆక్రమణల్లో చిక్కుకొని కనుమరుగైంది. భాగ్యనగరానికి మణిహారం లాంటి మూసీనది ఒకప్పుడు నగరవాసుల దాహార్తిని తీర్చి ప్రస్తుతం మురికి కూపంగా తయారై కబ్జాదారుల కోరల్లో చిక్కుకొని కనుమరుగవుతోంది. అడుగడుగునా ఆక్రమణలతో క్రమంగా స్వరూపం కోల్పోతుంది. మూసీ పరిసరాల్లో గతంలో వంద మీటర్ల వరకు బఫర్ జోన్ పరిధి ఉండేది. అంటే ఈ బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టరాదు. ఈ పరిధిని 2016లో ప్రభుత్వం 50 మీటర్లకు కుదిస్తూ, జీవోను జారీ చేసింది. ఆక్రమణదారులకు కుదింపు బాగా కలిసొచ్చింది. రియల్ వ్యాపారులు.. మూసీని మూసే పనిలో నిమగ్నమయ్యారు. తాజాగా సుందరీకరణ కోసం అక్రమ కట్టడాలు తొలగించేందుకు రంగం సిద్ధమవుతుండటంతో నివాసం ఉంటున్న పేదల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

మనం..మన పర్యాటకం



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సనత్‌నగర్/నాగార్జునసాగర్: తెలంగాణలోని పర్యాటక ప్రాంతాల ప్రమోషన్‌లో యువత భాగస్వాములు కావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. చారిత్రక, వారసత్వ కట్టడాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, ప్రకృతి–వన్య ప్రాణులు, సాహస కార్యకలాపాలకు అనువైన ఎన్నో ప్రాంతాలు తెలంగాణలో ఉన్నాయని, వాటిని సందర్శించి ప్రాచుర్యం కల్పించాలని యూట్యూబర్స్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌ను కోరారు. అంతర్జాతీయ పర్యాటక వారోత్సవాల్లో భాగంగా బుద్ధవనం థీమ్ పార్కుకు విస్తృత ప్రచారం కల్పించేందుకు చేపట్టిన 'రైడ్ టు నిర్వాణ' బైక్ ర్యాలీని మంత్రి ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ నాగార్జున సాగర్ బుద్ధవనం వద్ద ముగుస్తుంది. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ–హైదరాబాద్ బైక్ రైడర్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున బైక్ రైడర్స్ పాల్గొన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు టూరిజం ప్లాజా నుంచి తార్నాక వరకు బైక్ నడిపి బైకర్స్‌లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి విదేశీ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా భాగస్వామ్యాన్ని పెంచేందుకు విస్తృత ప్రచారం చేపట్టినట్లు చెప్పారు. ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధ క్షేత్రంగా భాసిల్లుతున్న నాగార్జున కొండ, చారిత్రక ప్రాముఖ్యతను మరింత ఇనుమడింపజేసి, బౌద్ధ సంస్కృతి వారసత్వాన్ని ఈ తరానికి తెలియజేయాలన్నది తమ ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. బుద్ధుడి బోధనలు నేటికీ అనుసరణీయమని, నేటి యువత జీవిత లక్ష్యాలను సాధించే క్రమంలో శాంతి, సహనం, కృషి, పట్టుదల వంటివి అలవర్చుకుని రాణించాలన్నారు. కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్‌రెడ్డి, పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో ఘన స్వాగతం

విఖ్యాంత్‌క్రత్రి ఆధ్వర్యంలో సాగర్‌లోని బుద్ధవనం చేరుకున్న బైక్ రైడర్లకు టీజీటీడీసీ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అంజిరెడ్డి, ట్రాన్స్‌పోర్ట్, వాటర్‌ఫ్లూయిడ్ జనరల్ మేనేజర్ ఇబ్రహీంలు, బుద్ధవనం డిజైన్ ఇంచార్జ్ శ్యాంసుందర్‌రావు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో ఒగ్గు కళాకారులతో సంప్రదాయ డప్పు వాయిద్యాలతో స్వాగతం పలకడం ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఈ బృందం బుద్ధవనంలోని మహాస్తూపం చుట్టూ ఉన్న సర్కిళ్లను బైకులపై మూడుసార్లు పరిక్రమలు నిర్వహించిన అనంతరం బుద్ధుని పాదాలు, బుద్ధ చరితవనం, ధ్యానవనం, స్తూపవనాలను సందర్శించి మహాస్తూపం చుట్టూ పరిక్రమలు చేశారు. మహాస్తూపం అంతర్భాగంలోని జ్ఞానమందిరం వీక్షించి అబ్బురపడ్డారు. ఈ సందర్భంగా నిర్వాణ బైక్ ర్యాలీలో పాల్గొన్న వారికి తెలంగాణ టూరిజం అధికారులు ప్రశంసా పత్రాలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన కడ్తాల్ మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ పట్టణానికి చెందిన వరికుప్పల మహేశ్.. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి దాటుతుండగా ఆమనగల్లు నుంచి వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని కల్వకుర్తి ఆస్పత్రికి పంపించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి అన్న వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వాగుపై వంతెన నిర్మించండి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అనంతరెడ్డి తదితరులు

ఆమనగల్లు: వాగుపై వంతెన నిర్మించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మాజీ వైస్‌ఎంపీపీ జక్కు అనంతరెడ్డి కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. మండల పరిధి మంగళపల్లి నుంచి చెన్నారం వెళ్లే మార్గంలోని వాగుపై వంతెన లేని కారణంగా ఇరు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వాగు ప్రవహించిన సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయని వెల్లడించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. అదే విధంగా మండల పరిధి మేడిగడ్డతండాలో సీసీరోడ్లు నిర్మించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కేఎస్‌ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్‌రాథోడ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ఆత్మరక్షణకు యుద్ధవిద్యలు అవసరం

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: ఆత్మరక్షణకు యుద్ధ విద్యలు ఎంతగానో దోహదపడతాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని గ్రీన్‌పార్కు ఫంక్షన్‌హాలులో ఈగల్ కుంగ్–ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఓపెన్ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్–2024 పోటీలను నిర్వహించారు. టోర్నీకి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ.. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కరాటే, కుంగ్‌ఫూ వంటి విద్యలను నేర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు నరేందర్ నాయక్, రాహుల్ నాయక్, ఎలికట్ట లింగం తదితరులు పాల్గొన్నారు.

రేటింగ్ చీటింగ్

సినిమాలకు రేటింగ్ ఇస్తే డబ్బులొస్తాయని ఆశ

ఇంట్లో కూర్చొని రోజుకు రూ.వేలల్లో సంపాదన

సామాజిక మాధ్యమాల్లో సైబర్ కేటుగాళ్ల ప్రకటనలు

నిరుద్యోగులు, గృహిణులే లక్ష్యంగా మోసాలు



సాక్షి, సిటీబ్యూరో: ''రాచకొండకు చెందిన ఓ గృహిణి వాట్సాప్‌కు 'జవాన్' సినిమాకు రేటింగ్ ఇస్తే డబ్బులొస్తాయని మెసేజ్ వచ్చింది. ఆశ్చర్యపోతూనే నేరస్తులు పంపిన నాలుగైదు సినిమాలకు రేటింగ్, రివ్యూలు ఇచ్చే సరికి ఆమె పేరుతో ఉన్న ప్రత్యేక వ్యాలెట్‌లో రూ.20 వేలు జమ అయ్యాయి. ఇంట్లో కూర్చొని డబ్బు సంపాదించానని తెలిస్తే తన భర్త మెచ్చుకుంటాడని భావించింది. ఈసారికి నేరస్తుల నుంచి ఒకేసారి పది సినిమాలకు రేటింగ్ లింక్‌లు పంపించాలంటే కొంత అమౌంట్ డిపాజిట్ చేయాలని ఆమెకు సందేశం వచ్చింది. దీంతో వాళ్ల మాటలను నమ్మి రూ.2 లక్షలు బదిలీ చేసింది. సినిమాలకు రేటింగ్ ఇచ్చినా ఆమెకు ఎలాంటి డబ్బులు రాలేదు. కమీషన్ రావాలంటే రూ.50 వేలు చార్జీ అవుతుందని కేటుగాళ్ల సూచన మేరకు అవి కూడా పంపించింది. అంతే అప్పట్నుంచి సైబర్ నేరస్తులు సైలెంటైపోయారు. ఆఖరికి వ్యాలెట్‌లో ఉన్న రూ.20 వేలు డ్రా చేసుకునే అవకాశం కూడా లేకపోయే సరికి తాను మోసపోయానని గ్రహించింది.

◆ ఇదీ సైబర్ నేరస్తుల రేటింగ్ వలకు చిక్కి విలవిల్లాడిన ఓ గృహిణి ఆవేదన. ఈమె ఒక్కరే కాదు సైబర్ నేరస్తుల సినిమాల రేటింగ్ వలకు చాలా మంది నగరవాసులు చిక్కుతున్నారు. గృహిణిలు, నిరుద్యోగులు, యువతను లక్ష్యంగా చేసుకొని కేటుగాళ్లు సరికొత్త మోసాలకు తెరలేపారు.

ఆశే నేరస్తుల పెట్టుబడి

''మేము పంపించే సినిమాలకు రేటింగ్‌లు, రివ్యూలు ఇస్తే చాలు.. ఇంట్లో కూర్చొని రోజుకు రూ.వేలల్లో సంపాదించవచ్చు'' ఈ ప్రకటన చూస్తే ఎవరికైనా ఆశ కలుగుతుంది. ఇదే నేరస్తుల పెట్టుబడి. ఫేస్‌బుక్, ట్విట్టర్, టెలిగ్రాం, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ వంటి సామాజిక మాధ్యమాలలో ఈ తరహా ప్రకటనలు, పోస్టులు పెడుతూ బాధితులను ఆకర్షిస్తున్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా జేబులు ఖాళీ అవుతాయని హెచ్చరిస్తున్నారు. మనం ప్రమేయం లేకుండా వాట్సాప్, టెలిగ్రాం, ఇన్‌స్టాగామ్ గ్రూప్‌లలో చేరకూడదని సూచిస్తున్నారు.

మోసం ఎలా చేస్తారంటే..

తాము సూచించిన సినిమాలకు రేటింగ్ ఇవ్వాలంటూ సోషల్ మీడియాలలో సందేశాలు పంపిస్తారు. రేటింగ్ ఇవ్వాల్సిన తీరు, కమీషన్ ఎలా చెల్లిస్తారు? ఎన్ని రోజుల్లో ఎంత సంపాదన వస్తుందో వివరంగా ఉంటుంది. ఈ లింకును క్లిక్ చేయగానే ఆటోమెటిక్‌గా సైబర్ నేరగాళ్లు ఏర్పాటు చేసిన వాట్సాప్, టెలిగ్రాం గ్రూప్‌లలో చేరతారు. ముందుగా కొన్ని సినిమాల పేర్లను పంపించి వాటికి రివ్యూ ఇవ్వగానే ప్రత్యేక వ్యాలెట్‌లో కొంత డబ్బు జమ చేస్తారు. మనకు నమ్మకం కుదిరేవరకూ మనం డబ్బు డ్రా చేసే అవకాశం ఇస్తారు. ఆ తర్వాత ఎక్కువ సినిమాలకు రేటింగ్ ఇచ్చే అవకాశం ఇస్తామంటూ డబ్బు వసూలు చేస్తారు.

ఫెన్సింగ్ వైరు తగిలి వ్యక్తి దుర్మరణం

చేవెళ్ల: ఓ రైతు తన పంటను కాపాడుకునేందుకు వేసిన విద్యుత్ ఫెన్సింగ్‌ను తాకి మరో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి ఊరేళ్ల గ్రామంలో ఓ రైతు.. కౌలుకు తీసుకున్న పొలంలో మొక్కజొన్న సాగు చేశాడు. అడవి పందుల బెడద ఎక్కువగా ఉండడంతో పంట చుట్టూ ఫెన్సింగ్ వైరు ఏర్పాటు చేశాడు. మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన రాజు(35) మొక్కజొన్న కంకులు, పూలు కోసుకునేందుకు పొలంలోకి వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో రాజు.. ప్రమాదవశాత్తు ఫెన్సింగ్ వైర్లకు తగిలి మృత్యువాత పడ్డాడు. మూడు రోజులుగా అటువైపు ఎవరూ వెళ్లకపోవడంతో శవం కుళ్లిపోయింది. ఆదివారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

నేటి సదస్సును జయప్రదం చేయండి



రామస్వామి

షాబాద్: ఏఐటీయూసీ సదస్సును జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23న తుక్కుగూడ, 24న శంషాబాద్‌లో రాష్ట్రస్థాయి కౌన్సిల్ సమావేశం జరగనుందని పేర్కొన్నారు. తుక్కుగూడ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో కార్మికుల భద్రత, వారి హక్కుల కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నారని వెల్లడించారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న నర్సయ్యగౌడ్

- భవిష్యత్ ఎన్నికల్లో బీజేపీదే హవా
- పార్టీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

యాచారం: రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. భవిష్యత్తులో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి పలువురికి సభ్యత్వాలు అందజేశారు. అనంతరం బూర మాట్లాడారు. సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రుణమాఫీ పెద్ద డ్రామాగా మారిందని ఆరోపించారు. కేసీఆర్‌ప్రభుత్వ విధానాలనే రేవంత్‌రెడ్డి సర్కార్ అవలంబిస్తుందని ఆయన విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మడం లేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో కమలం పార్టీకి అధికారం ఇవ్వడానికి ఆసక్తి చూపుతున్నారని స్పష్టంచేశారు.

యజ్ఞంలా నిర్వహించాలి

పార్టీ మరింత బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని, అందులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరికీ సభ్యత్వాన్ని అందజేయాలని బూర సూచించారు. సభ్యత్వ నమోదును యజ్ఞంగా భావించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరిపల్లి అంజయ్య యాదవ్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్ నాయిని సత్యనారాయణ, నాయకులు టేకుల రాంరెడ్డి, గోగికార్ రమేష్, శ్రీనివాస్ గుప్తా, విజయకుమార్, బీరప్ప, నరేందర్‌గౌడ్, ఐలేష్, రాజు, మల్లేశ్, వేణు పాల్గొన్నారు.

చేయి తగిలిందని పోలీస్ మార్క్ కేసు

గచ్చిబౌలి: పబ్‌లో చేయి తగిలిందని ఓ డాక్టర్ మీద కేసు నమోదు చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాలుగు రోజుల క్రితం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని తబులా రసా పబ్‌కు ఓ ఐపీఎస్ ఆఫీసర్ భార్యతో కలిసి వెళ్లారు. అదే పబ్‌కు కొంత మంది డాక్టర్లు వెళ్లారు. ఐపీఎస్ భార్య వాష్‌రూమ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మదీనాగూడకు చెందిన ఓ డాక్టర్ చేయి తగిలింది. పొరపాటు జరిగిందని సదరు డాక్టర్ ఆమెకు సారీ చెప్పారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన ఆమె జరిగిన విషయాన్ని భర్తకు చెప్పింది. ఆ తర్వాత క్షణాల మీద గచ్చిబౌలి పోలీసులు పబ్‌కు చేరుకున్నారు. సదరు డాక్టర్‌ను గచ్చిబౌలి పీఎస్‌కు తరలించారు. నేను కావాలని చేయలేదని, యాదృచ్ఛికంగా జరిగిందని చెప్పినా పోలీసులు శాంతించలేదు. మద్యం ఎక్కువ తాగి అసభ్యంగా ప్రవర్తించాడా అనేది నిర్ధారించుకునేందుకు బ్రీత్ ఎనలైజర్ చేశారు. మద్యం అతిగా తాగలేదని తేలినట్లు సమాచారం. గంటల తరబడి స్టేషన్‌లోనే కూర్చోబెట్టారు. మరుసటి రోజు పబ్ నిర్వాహకులతో ఫిర్యాదు తీసుకొని ఆ డాక్టర్‌పై కేసు నమోదు చేసి, నోటీసు ఇచ్చి పంపించారు. మహిళలను కించపరిచే వ్యవహరించినా, అసభ్యంగా ప్రవర్తించినా చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. కాని ఐపీఎస్ భార్య కావడంతో చిన్న విషయానికి పోలీసులు హంగామా చేశారనే ప్రచారం జరుగుతోంది. సామాన్యుల ఫిర్యాదుపైనా పోలీసులు ఇలానే వ్యవహరిస్తే బాగుండేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంత జరిగినా పోలీసులు మాత్రం తబులా రసా పబ్ కేసుపై నోరు మెదపడం లేదు. కేసు గురించి మాకు తెలియదని, కేవలం పబ్‌లలో తనిఖీలు మాత్రమే చేశామని గచ్చిబౌలి పోలీసులు బుకాయించడం గమనార్హం.

ఉస్మానియా ఆస్పత్రిలో పాముల కలకలం

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పాత భవనం, పక్కనే ఉన్న డాక్టర్స్ క్యాంటీన్‌లో పాములు కలకలం రేపాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మూసీనదిలో నుండి కొట్టుకువస్తున్న పాములు తరచూ ఉస్మానియాలోకి వస్తున్నాయి. తాజాగా శనివారం రాత్రి సమయంలో అత్యంత ప్రమాదకరమైన రక్తపింజరి పాము డాక్టర్స్ క్యాంటీన్ వద్ద ప్రత్యక్షం కావడంతో సిబ్బంది భయాందోళనకు గురై స్నేక్ సొసైటీ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న గణేష్ అతని బృందం చాకచక్యంగా పామును సంచిలో బంధించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కొన్ని నెలలుగా ఆసుపత్రిలోని వ్యర్థాలను డాక్టర్స్ క్యాంటీన్ ముందున్న ఖాళీ స్థలంలో వేయడంతోనే తరచు పాములు వస్తున్నాయని, దీంతో అక్కడకు వెళ్లాలంటే భయంగా ఉందని పలువురు వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాతంరాయిలో నివాసముంటున్న నాగరాజు (40) ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి గురై 4,5 రోజులుగా ఇంటి వద్దే ఉంటూ మద్యం తాగుతూ గడుపుతున్నాడు. ఈ నెల 21న భార్య దివ్యతో పాటు పిల్లలను సమీపంలోనే ఉన్న అత్తవారి ఇంటి వద్ద వదిలేసి ఇంటి వచ్చాడు. ఆదివారం ఉదయం నుంచి ఫోన్ తీయకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

చేపల వేటకు వెళ్లి.. వలకు చిక్కి

వాగులో వ్యక్తి మృత్యువాత



అంజయ్య మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు వలకు చిక్కుకొని మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధి అయ్యవారిపల్లి శివారులో చోటు చేసుకుంది. ఏఎస్ఐ రాంచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌలపల్లి గ్రామానికి చెందిన కుర్వగూడెం అంజయ్య(50), యాదమ్మ దంపతులు. అయ్యవారిపల్లి సమీపంలోని వాగులో నీరు పారుతుండటంతో చేపల పట్టేందుకు వెళ్లారు. వలను వాగులో వేసిన ఆంజనేయులు.. కొద్ది సేపటి తరువాత చేపలు పడ్డాయని చూసేందుకు వాగులోకి దిగాడు. అతని కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఆ సమయంలో ఒడ్డున కూర్చున్న భార్య యాదమ్మ భర్తకోసం ఎంతసేపు చూసినా బయటకు రాలేదు. దీంతో భర్త నీటిలో మునిగిపోయాడునుకుని చుట్టుప్రక్కల వారికి విషయాన్ని చెప్పింది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ రాంచందర్.. సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను తెలుసుకున్నారు. ఫైర్ స్టేషన్ సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మహిళ మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: రోడ్డు దాటుతుండగా ప్రైవేట్ బస్సు ఢీకొట్టడడంతో ఓ మహిళ మృతిచెందింది. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి గండిమైసమ్మ దేవాలయం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగిందని సమాచారం తెలుసుకున్న పోలీసులు.. సంఘటనా స్థలానికి చేరుకుని, మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని మహిళగా, మృతురాలికి సుమారు 50 ఏళ్లు ఉంటాయని నిర్ధారణకు వచ్చారు. సంఘటనపై ఆరా తీయగా హైదరాబాద్ నుంచి నల్గొండ వైపు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు.. రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొట్టడంతో మృతి చెందినట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తండాను మా ఊరిలో కలపొద్దు

ఎమ్మెల్యే వీర్లపల్లికి గూడూరు వాసుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నందిగామ: పెద్ద గుట్టతండాను గూడూరులో విలీనం చేయవద్దని కోరుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఆ గ్రామస్తులు వినితప్రతం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కొత్తూరు మండల పరిధి మక్తగూడకు అనుబంధ గ్రామంగా ఉన్న పెద్దగుట్టతండాను విడదీసి గూడూరు గ్రామ పంచాయతీలో కలపాలని కోరుతూ.. ఆ తండాకు చెందిన కొందరు ఇటీవల సంతకాలు చేసినట్లు తెలిసిందని పేర్కొన్నారు. గూడూరులో ఇప్పటికే 1700 జనాభా, 1250 ఓటర్లు ఉన్నారని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ సత్తయ్య, చేగూరు పీఏసీఎస్ వైస్ చైర్మన్ మున్నూరు పద్మారావు, గ్రామస్తులు దయానంద్, సురేష్, రమేష్, మల్లేశ్, అశోక్, శివరాజ్, చెంద్రయ్య, వెంకటేశ్, రాజు, శ్రీశైలం, మహేందర్ రెడ్డి, నారాయణ, గణేశ్వర్, రవి, లింగం తదితరులు ఉన్నారు.

'బెల్టు' దుకాణాలు మూసేయండి



శేఖర్‌కు మద్దతు తెలుపుతున్న ప్రజా సంఘాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు

నిరాహార దీక్ష చేపట్టిన యువకుడు

షాద్‌నగర్ రూరల్: 'పచ్చని పల్లెల్లో బెల్టు షాపులు చిచ్చు పెడుతున్నాయి. యువకులు మద్యానికి బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. వెంటనే మద్యం విక్రయ దుకాణాలను ఎత్తివేయాలి' అని గ్రామానికి చెందిన ఓ యువకుడు డిమాండ్ చేశారు. బెల్టు షాపులను మూసివేయాలని కోరుతూ.. ఆదివారం మండల పరిధి కిషన్‌నగర్ గ్రామంలో నడుల్ల శేఖర్ అనే వ్యక్తి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు పలు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో సుమారు 30 మద్యం దుకాణాలు ఉన్నాయని, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు జోరుగా విక్రయాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విచ్చలవిడి మద్యం అమ్మకాలతో గ్రామ ప్రజలు అత్యధికంగా మద్యం మత్తులో జోగుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ మైకంలో ఇంటా బయట గొడవలు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు గ్రామ సంక్షేమాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని బెల్టు దుకాణాలను ఎత్తివేయాలని కోరారు. లేని పక్షంలో నిరాహార దీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నామని శేఖర్ స్పష్టంచేశారు. మద్దతు తెలిపిన వారిలో పాండు, యాదయ్య, జోగు భూషణ్, చాకలి మల్లయ్య, ఎల్లంపల్లి శ్రీను, పెంటయ్య, మహేశ్, రాజు, కృష్ణ ఉన్నారు.

బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని అంతం చేశారు

- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఐదుగురు నిందితుల అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్

కుషాయిగూడ: హత్య కేసులో సాక్షిగా ఉన్న వ్యక్తి తరచుగా బ్లాక్ మెయిల్ చేస్తుండటంతో విసిగిపోయి తన మిత్రులతో కలిసి హత్యచేశాడు. ఈ నెల 19న చోటు చేసుకున్న హత్య కేసును ఛేదించిన కుషాయిగూడ పోలీసులు.. నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను ఆదివారం ఇన్‌స్పెక్టర్ అంజయ్య వెల్లడించారు. కాప్రా, కందిగూడకు చెందిన శ్రవణ్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. 2018లో జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. అయితే ఈ హత్య కేసులో కంటోన్మెంట్, సర్వెంట్ క్వార్టర్స్‌లో నివాసం ఉండే జోసెఫ్ బెనర్జీ ప్రత్యక్ష సాక్షిగా ఉన్నాడు. దీంతో శ్రవణ్‌ను జోసెఫ్ తరచుగా బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బు డిమాండ్ చేసేవాడు. జోసెఫ్ వేధింపులు తాళలేని శ్రవణ్‌కుమార్ అతని అడ్డు తొలగించుకోవాలని భావించాడు. ఈ క్రమంలో ఈ నెల 19న జోసెఫ్,... శ్రవణ్ ఇంటికి వెళ్లి డబ్బుకోసం గొడవపడ్డాడు. దీంతో ఆగ్రహానికి గురైన శ్రవణ్ అతడు బతికుంటే నాకు ఎప్పటికైనా ప్రమాదమేనని భావించి అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. విషయాన్ని కందిగూడకు చెందిన తన మిత్రులు కృష్ణారెడ్డి, షేక్ గౌస్, మహ్మద్ గౌస్ అలియాస్ అమీర్, శ్రీకాంత్‌లకు చెప్పి జోసెఫ్ హత్యకు ప్లాన్ చేశారు. అదే రోజు అంతా కలిసి మద్యం తాగారు. టీ స్టాల్ వద్ద ఉన్న జోసెఫ్‌ను తమ కారులో ఎక్కించుకొని శ్రవణ్ ఇంటి సమీపంలోకి తీసుకెళ్లి కర్రలతో కొట్టి హత్య చేశారు. చనిపోయినట్లు నిర్ధారించుకొని శవాన్ని కారులో తీసుకెళ్లి కందిగూడ శ్మశానవాటికలో పడేసి పరారయ్యారు. ఘటన స్థలం వద్ద లభ్యమైన, సీసీ కెమెరాల్లో లభించిన ఆధారాలతో విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను ఆదివారం అరెస్టు చేసి చర్లపల్లి జైల్‌కు రిమాండ్‌కు తరలించారు.